క్లుప్తంగా


మునగాకు సంజీవినిలా పనిచేస్తుంది

సింహాద్రిపురం: మునగ ఆకు అద్భుత సంజీవిలా పనిచేస్తుందని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ వసంత తెలిపారు. శుక్రవారం మండలంలోని కోవరంగుంటపల్లె అంగన్‌వాడీ సెంటర్‌లో సామాజిక వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ వసంత హాజరై మాట్లాడుతూ మునగాకుతో 300 రకాల వ్యాధులు నయమవుతాయన్నారు. మునగాకు రక్తహీనతను తగ్గించడం, ఐరన్ క్యాల్షియం ఉండే విలువైన మునగాకు అన్నారు. అలాగే రోగ నిరోధక శక్తి పెంచి గుండె పనితీరును మెరుగుపరుస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పులివెందుల రూరల్: స్వర్ణకారులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్‌బాబు, ట్రాఫిక్ సీఐ హాజీవల్లిలు తెలిపారు. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో బంగారు దుకాణ యజమానులతో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీసీ కెమెరాలు ఉండటంవల్ల దొంగలను ఈజీగా పట్టుకోవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ తమ దుకాణాల వద్ద తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పట్టణంలో ఎవరైనా అనుమానస్పదంగా తిరుగుతున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నారాయణ తెలిపారు.

తగ్గిన వరద ఉధృతి


పెన్నానదిలో తగ్గిన వరద ఉధృతి

జమ్మలమడుగు: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి వచ్చే వరద నీటి ఉధృతి తగ్గింది. గురువారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు శుక్రవారం నాటికి దాదాపు 4000 క్యూసెక్కుల నీటిని మాత్రమే పెన్నానదిలోనికి విడుదల చేశారు. ప్రస్తుతం గండికోట జలాశయం నుంచి నాలుగువేల క్యూసెక్కుల నీరు మైలవరం జలాశయంలోనికి వస్తుంది. 24 గంటల్లో మైలవరం జలాశయం నుంచి సరాసరిగా ఏడువేల క్యూసెక్కుల నీటిని పెన్నానదిలోని అధికారులు విడుదల చేశారు. జలాశయంలో ప్రస్తుతం ఆరు టీఎంసీల వరకు నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే చర్యలు

చింతకొమ్మదిన్నె: బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులు మద్యపానం సేవిస్తే కఠినచర్యలు తీసుకుంటామని చింతకొమ్మదిన్నె సీఐ శంకర్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం సీఐ ఆధ్వర్యంలో పోలీసులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే మందుబాబులు, ఆకతాయిలు ఉపయోగించే స్థలాలను గుర్తించి వాటిని మూసివేశారు. సీకేదిన్నె పరిధిలో ఏఎల్ కాలనీ, బుగ్గలేటిపల్లె వెంచర్లలో తాగుబోతులు, అసాంఘిక కార్యక్రమాలు జరిగే ఉన్న ప్రాంతాలను గుర్తించి మూసివేశారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

పులివెందుల టౌన్: రాష్ట్రస్థాయి గ్రీన్ వరల్డ్ పెయింటింగ్ కాంపిటీషన్‌లో పులివెందుల నారాయణ పాఠశాలకు చెందిన ఎ.దేష్ణశ్రీ ప్రతిభ చూపి మొదటి బహుమతి పొందినట్లు ఆ పాఠశాల ఏజీఎం నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా పెయింటింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్ స్పోర్ట్స్ లాంటి వాటిల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విద్యార్థిని ఎ.దేష్ణశ్రీకి మెమెంటో, సర్టిఫికెట్లు ఇచ్చి అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ హరిత, అకడమిక్ డీన్స్ త్రివేణి, భాస్కర్, ఉపాధ్యాయులు అభినంధించారు.

కిడ్నీ వ్యాధి చిన్నారికి ఆర్థిక సాయం


చిన్నారి రషీదా కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న దాతలు

వేంపల్లె: పట్టణంలోని స్థానిక బిడాలమిట్టలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి రషీదాను శుక్రవారం ఆటో ఫైనాన్స్ మేనేజర్ చాగలేటి వెంకటేష్, తదితరులు చిన్నారి తల్లిదండ్రులకు రూ.21వేలు నగదును అందించారు. మహబూబ్‌బాషా కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని.. చిన్నారి రషీదా పుట్టిన రెండేళ్ల నుండి కిడ్నీలు చెడిపోవడంతో తల్లిదండ్రులు డయాలసిస్ చేయిస్తూ కాపాడుకుంటూ వస్తున్నారన్నారు. మరింత ఆర్థిక సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు. చిన్నారి రషీదాను ఆదుకునేందుకు 7995043294 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కుళ్లిన వేరుశనగతో రైతన్న కుదేలు

నష్టాలతో రైతుల విల విల

కొండాపురం: ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు పంటలను వర్షాలు నిలువునా ముంచేశాయి. అరుగాలం శ్రమ వర్షార్పణమైంది. ఖరీఫ్ ప్రారంభంలో అరకొర వర్షాలకు మండలంలో వేరుశనగ 250 ఎకరాలు, ప్రొద్దుతిరుగుడు 120, సోయాచిక్కుడు 50 ఎకరాలు పంటలు సాగు చేశారు. కొందరు రైతులు సాగు చేసిన పంటలను కోత కొసుకున్నారు. కోత కోయని వేరుశనగపంటకు తీవ్రనష్టం కలిగించాయి. మిగిలిన కొద్దిపాటి పంటను కూడా ప్రస్తుతం అమ్ముకోని దుస్థితి నెలకొంది. గత నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలకు ప్రొద్దుతిరుగుడు, వేరుశనగ పంట పొలాలు కుళ్లిపోయాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి లేక.. పెట్టుబడి రాక

ఖరీఫ్ సీజన్‌లో అరకొర వర్షాలకు వేరుశనగ పంట సాగు చేశారు. ఎకరాకు విత్తనాలు, ఎరువులు, కలుపులు ఖర్చులు కలుపుకుని సుమారు రూ.30 వేల వరకు ఖర్చు వస్తుంది. ఖరీఫ్‌లో వర్షాలు సకాలంలో కురవక వేరుశనగ పంటకోస్తుంటే ఎకరాకు 5 బస్తాలు అవుతున్నాయి. బస్తా ధర రూ.2800 ప్రకారం కోనుగోలు చేస్తున్నారు. నాలుగు రోజులుగా వర్షాలు పడుతుండటంతో తడిసిన వేరుశనగ కాయలు నల్లగా ఉన్నాయని తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు.


వర్షంలో తడిసికుళ్లిన వేరుశనగ పంట


వర్షానికి నల్లగా మారిన వేరుశనగ కాయలు

వర్షంతో పశు గ్రాసం కుళ్లిపోయింది



కె.సుగుమంచిపల్లె పొలంలో 20 ఎకరాలు వేరుశనగ పంట సాగు చేశాను. విత్తనం వేసిన తర్వాత అరకొర వానలతో పంట దిగుబడి తగ్గింది. పంట కోసిన తర్వాత వరుస వర్షం కురవడంతో పొలంలో నే కుళ్లిపోయింతి. దీంతో వేరుశనగ కాయలు నల్లగా మారడంతో పాటు పశుగ్రాసం కుళ్లిపోయింది. ఎకరాకు పెట్టుబడి ఖర్చురూ. 25 వేల నుంచి రూ.30 వేల వరకు వచ్చింది. పెట్టిన పెట్టుబడులు రాలేదు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాం. –గంగిరెడ్డి, రైతు. కె.సుగుమంచిపల్లె

పెట్టుబడులు రాలేదు



వేరుశనగ పంట 11 ఎకరాల్లో సాగు చేశా. పెట్టుబడి ఎకరాకు విత్తనాలు ఎరువులు సేద్యం, కలుపు, కోత ఖర్చులు కలపి రూ.28 వేలు వచ్చింది. ఎకరాకు ఐదు బస్తాలు దిగుబడి వచ్చింది. బస్తా రూ. 2800 ధరతో అమ్మేశాను. ఎకారకు 14 వేలు వచ్చింది. పెట్టిన పెట్టుబడులు సగం కూడా రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. – పోతన బోయినకృష్ణ, రైతు, కె.సుగుమంచిపల్లె

నిర్దిష్ట అభ్యసనా వైకల్యం అనేది పెద్ద సమస్య కాదు

వేంపల్లె: నిర్దిష్ట అభ్యసనా వైకల్యం అనేది పెద్ద సమస్య కాదని, అలాంటి పిల్లలను గుర్తించి సకాలంలో ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ ఇస్తే వారు కూడా సామాన్య విద్యార్థులతోపాటు చదువులో రాణిస్తారని ఎంఈఓ జాఫర్ సాదిక్ తెలిపారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్దిష్ట అభ్యసన వైకల్యం మాస ఉత్సవం సందర్భంగా డిస్లెక్సియా ఫర్ వాక్ అనే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ డిస్లెక్సియా అనేది ప్రత్యేకమైన నేర్చుకునే లోపం అన్నారు. ప్రధానంగా చదవడం, రాయడం అంటే నైపుణ్యాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ద్వారా అడ్డంకులను అధిగమించవచ్చునన్నారు. అందరి విద్యార్థులాగే వీరికి కూడా స్కాలర్‌షిప్‌లు, అలవెన్స్‌తోపాటు పదవ తరగతి పరీక్షలలో మార్కులు మినహాయింపు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.


విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ జాఫర్ సాధిక్, తదితరులు

అనంతరం విద్యార్థిని విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈనెల 14 నుంచి 19 వరకు నిర్దిష్ట అభ్యసన వైకల్యం మీద విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు యశోద, సుజాతలు, ఉపాధ్యాయులు సుకన్య, ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభం

ఎర్రగుంట్ల: మండల పరిషత్ సభా భవనంలో శుక్రవారం సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు రెండు రోజులు పాటు శిక్షణ తరగతులను ఎంపీడీఓ వెంకటరమణయ్య ప్రారంభించారు. శుక్రవారం, శనివారం రెండు రోజులు పాటు జరుగుతాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామ పంచాయతీ విధివిధానాలపై సర్పంచ్‌లకు, సభ్యులకు శిక్షణ అందించారు. ఈఓపీఆర్డీ రహమతులయ్య, సభ్యులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఎల్ఈడీ బల్బుల విధి నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పద్మనాభరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శశికుమారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల: గ్రామీణ ప్రాంతాలలో పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్య రక్ష అని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి


ఎర్రగుంట్ల: శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణయ్య

తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఫ్లోరెన్స్ పేచి మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు, చెత్త నుంచి సంపద తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఆర్పీ సురేష్, తదితరులు ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు.

పాతపద్ధతిలో విత్తనాన్ని పంపిణీ చేయాలి

వీరపునాయునిపల్లె: ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న బుడ్డ శనగ విత్తనాన్ని పాత పద్ధతిలోనే అందించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల రైతు సంఘం నాయకుడు భాస్కర్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన ఉరుటూరు రైతు సేవా కేంద్రంలో చేపడుతున్న విత్తన పంపిణీ కార్యక్రమాన్ని సందర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం చేపడుతున్న విత్తన పంపిణీ విదానం రైతులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.6500 విత్తనం దొరుకుతోందని అంతేకాకుండా రైతు విత్తనాన్ని చూసి కొనుగోలు చేసేందుకు వీలుంటుందన్నారు. ప్రభుత్వం క్వింటాల్ ధర రూ.7050లకు పైగా చూపిస్తూ 25 శాతం రాయితీతో అందిస్తోందన్నారు. గత ప్రభుత్వం 50 శాతం రాయితీ అందించడంతో పాటు ఒక్కసారి వే లిముద్ర వేసి నగదు చెల్లిస్తే సదరు రైతు కుటుంబంలో ఎవరు వచ్చినా విత్తనాన్ని తీసుకెల్లేవారన్నారు. ప్రస్తుతం వేలిముద్ర వేయించుకుని నగదు తీసుకొన్న తరువాత కూడా సదరు రైతు వస్తేనే విత్తనం ఇస్తామనడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.

తిరుమలకు సొంత పాల డైరీపై సమాధానం చెప్పాలి

వేంపల్లె : టీటీడీకి సొంత పాల డైరీ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని బీసీవై పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిర్మలా యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వేంపల్లెలో ఆమె మాట్లాడుతూ బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ 1000 గోవులను దానంగా ఇస్తామని చెప్పడం జరిగిందని, వాటిపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. వెయ్యి గోవులతో లక్ష గోవులను సమకూర్చుతానని తమ అధ్యక్షుడు చెప్పాడని, అయినా ముఖ్యమంత్రి మౌనంగా ఉండడమనేది మంచిది కాదన్నారు. సీఎం చంద్రబాబు టీటీడీ పరిరక్షణ కోసం పాటుపడకపోవడం విచారకరమన్నారు. పాల డైరీ ఏర్పాటు చేయడం వలన ప్రసాదాలు, లడ్డూలో ఎలాంటి కల్తీలు జరిగేందుకు అవకాశం ఉండదన్నారు. కాబట్టి మా అధ్యక్షుడు విరాళంగా ఇస్తున్న వెయ్యి గోవులను స్వీకరించి టీటీడీ ఆధ్వర్యంలో పాల డైరీని ఏర్పాటు చేయాలన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ

లింగాల: లింగాల, దొండ్లవాగు గ్రామాల్లో శుక్రవారం అధికారులు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ గంగరాజులు లింగాల పంచాయతీలో ఉపాధి హామీ మెటీరియల్ పేమెంట్ నిధుల కింద రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.9.65 లక్షలు, దొండ్లవాగు పంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.8.65 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

చెన్నూరులో..

చెన్నూరు(వల్లూరు): గ్రామీణ ప్రాంతాల రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. చెన్నూరు మండలంలోని కొక్కరాయపల్లెలో శుక్రవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొని రూ.13 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె: మండలంలో ఎస్.పాలగిరి, మొయిళ్లచెరువు, గోనుమాకులపల్లె గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణ పనులను శుక్రవారం అధికారులు ప్రారంభించారు. మొయిళ్లచెరువు గ్రామంలో రూ.10 లక్షలు, ఎస్.పాలగిరిలో రూ.15లక్షలు, గోనుమాకులపల్లెలో రూ.15లక్షల సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని పంచాయతీ రాజ్ ఏఈ మల్లారెడ్డి తెలిపారు.

వేంపల్లెలో...

వేంపల్లె: పట్టణంలోని బిడాలమిట్లలో శుక్రవారం అధికారులతో కలిసి టీడీపీ మండల నాయకులు రామమునిరెడ్డి సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

కొప్పర్తిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

చింతకొమ్మదిన్నె: మండల పరిధిలోని కొప్పర్తి గ్రామపంచాయతీలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీసీ రోడ్లకు శంకుస్థాపన నిర్వహించారు. కొప్పర్తి సర్పంచ్ కె. సుజాతమ్మ, ఎంపీటీసీ సుబ్బమ్మలు పూజా కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కమ్మవారిపల్లె పంచాయతీలో రూ.13.89 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ బాబయ్య, ఎంపీటీసీ దొండపాటి వెంకటరెడ్డిలు పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు.

కమలాపురంలో భారీ వర్షం

కమలాపురం: మండలంలో గురువారం రాత్రి దాదాపు గంటకు పైగా భారీ గాలులు, మెరుపులు, ఉరుములతో కుండపోత వర్షం కురిసింది. 62.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా ఈ వర్షానికి తోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ కాలనీ, పోలీస్ లైన్ వీధి, బ్రాహ్మణవీధి, రామ్‌నగర్, కృష్ణానగర్, మారుతినగర్ తదితర కాలనీలన్నీ నీట మునిగాయి. అలాగే పలు ప్రాంతాల్లో రోడ్లు సైతం కనబడకుండా నీట మునిగాయి. కాలనీలకు వెళ్లడానికి, అందులోని ఇళ్లలోకి రాక పోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల వర్షం నీరు ఎక్కడికి ప్రవహించకుండా అలాగే అక్కడికక్కడే ఆగిపోయింది. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వర్షం నీళ్లు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు. కాగా టి.చదిపిరాళ్ల, సి.గోపులాపురం


పోలీస్‌లైన్ వీధికి వెళ్లకుండా రోడ్డు పైనే నిలిచిన వర్షం నీరు

, పాచికలపాడు, సంబటూరు తదితర గ్రామాల్లోని పొలాల్లో వర్షం నీరు నిలవడంతో అవి నదులను తలపిస్తున్నాయి. అలాగే కమలాపురం, చాపాడు మండలాలకు వారధిగా ఉన్న పెన్నా నదిపై ఉన్న కాజ్ వే చాలా వరకు తెగిపోయింది. దీంతో ఈ రెండు మండలాలకు రాకపోకలు స్థంబించిపోయాయి.

పోటీతత్వాన్ని అలవరచుకోవాలి

కమలాపురం: ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులందరూ ప్రాథమిక స్థాయి నుంచే పోటీతత్వాన్ని అలవరచుకోవాలని చిన్నచెప్పలి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం చిన్నచెప్పలి హైస్కూల్ విద్యార్థులకు సెప్టెంబర్ మాసంలో జరిగిన ప్రాజెక్ట్ వర్క్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ వారు వితరణ చేసిన బహుమతులు అందజేశారు. వాటిని కంటి వైద్యులు అరుణ, మనీష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రసుత్తం పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులందరూ పోటీ తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతుగా సాయం చేయడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠ


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వైద్యులు, హెచ్ఎం

శాలల్లో చదివే విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికా బద్ధంగా చదివి మంచి మార్కులతో టెన్త్ క్లాస్‌లో మండల, జిల్లా టాపర్లుగా నిలవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏకలవ్య ఫౌండేషన్ విద్యావాహిని కో ఆర్డినేటర్ వీరనారాయణ పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ధ్వంసమైన వేప చెట్టు

పెండ్లిమర్రి: మండలంలోని మర్రిమాకులపల్లెలో గురువారం రాత్రి పెద్ద వేపచెట్టుపై ఒక్కసారిగా పిడుగు పడటంతో చెట్టుపై భాగంలో ఉన్న కొమ్మలు విరిగాయి. చెట్టు పైనుంచి కింది వరకు చీలిపోయింది. చూట్టు పక్కల ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గత పదిహేను రోజుల నుంచి పెండ్లిమర్రి మండలంలో ఇప్పటికి మూడు సార్లు పిడుగులు పడటంతో పిడుగు పాటుకు గురై ముగ్గురు వ్యక్తులు, ఒక పశువు చనిపోయింది. దీంతో మండల ప్రజలు పిడుగుల శబ్దాలకు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు.


మర్రిమాకులపల్లెలో పిడుగు పాటుకు ధ్వసంమైన వేపచెట్టు

నల్లబ్యాడ్జీలతో నిరసన

ఎర్రగుంట్ల: డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలో పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను అనేక మార్లు ఏపీ జెన్‌కో యాజమాన్యం దృష్టికి తెచ్చామని అయినా స్పందనలేదన్నారు. చాలా సంవత్సరాల నుంచి అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారన్నారు. విద్యార్హతలు ఉన్న స్కిల్డ్ గ్రేడ్లు మార్చలేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమబాట పట్టడానికి వెనుకాడమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

కమలాపురం: ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో వీఏఏ, ఎరువుల, పురుగు మందుల దుకాణాల డీలర్లు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రతి ఒక్కరు తమకు కావలసిన సమాచారాన్ని స.హ. చట్టం ద్వారా పొందవచ్చన్నారు. ఈ ప్రక్రియ మూడు దశల్లో ఉంటుందన్నారు. మొదటి దశలో సమాచారం కావలసిన వారు ముందుగా సెక్షన్ 6(1) చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తులో తమకు కావాలసిన అంశాలను పొందు పరచాలన్నారు. 30 రోజుల్లోపు దరఖాస్తుదారుడికి సమాచారం అందకుంటే, లేదా వారిచ్చిన సమాచారంతో తృప్తి చెందకుంటే రెండవ దశలో సెక్షన్ 19(1) ద్వారా ఉన్నతాధికారులకు 30 రోజుల్లో అప్పీలు చేసుకోవచ్చున్నారు. రెండవ దశలో వచ్చిన సమాచారంతో తృప్తి చెందనప్పుడు 90 రోజుల్లోపల సమాచార కమిషనర్‌కు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఏఓ సరస్వతి సమాచార హక్కు చట్టం ప్రయోజనం, సెక్షన్లు గురించి కూలంకుషంగా వివరించారు.

చెన్నూరులో..

చెన్నూరు(వల్లూరు): ప్రతి ఒక్కరూ సమాచార హకు చట్టంపై అవగాహన కలిగి వుండాలని చెన్నూరు మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీదేవి తెలిపారు. చెన్నూరులోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులకు సమాచార హక్కు చట్టంపై ఆమె అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు.



మాట్లాడుతున్న ఏఓ సరస్వతి

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె(వల్లూరు): స్థానిక గ్రామ రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సమాచార హక్కు చట్టంపై మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులకు మండల వ్యవసాయ అధికారి ఈశ్వర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. సమాచార హక్కు చట్టంపై పూర్తిగా అవగాహన కల్పించి వివిధ సెక్షన్లను వివరించారు. కోరిన సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత సంబంధించిన సమాచార అధికారిపై ఉందన్నారు. ప్రజలు ఈ సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకుని అవసరమైన సమాచారాన్ని ప్రభుత్వ అధికారులు, సంస్థల నుండి పొందగలరన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల టౌన్: పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

కాంట్రాక్టు ఫ్యాకల్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అనిల్‌కుమార్‌రెడ్డి



వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటీల కాంట్రాక్టు ఫ్యాకల్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ బొజ్జా అనిల్‌కుమార్‌రెడ్డిని కాంటాక్ట్ అధ్యాపకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో కాంట్రాక్టు అధ్యాపకులు సమావేశమై కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి కాంట్రాక్టర్ అధ్యాపకుల సమస్యల కోసం తమ వంతు పోరాడుతానన్నారు. వైస్‌ప్రెసిడెంట్‌గా ఒంగోలు ట్రిపుల్ ఐటీకి చెందిన డాక్టర్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన తేజకిరణ్, జాయింట్ సెక్రటరీగా నిర్మలకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన టి.శివ కుమార్‌లు ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జమ్మలమడుగు రూరల్: పట్టణంలో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీ రాజగోపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

విత్తనాల పంపిణీ పరిశీలన

లింగాల: మండలంలోని కామసముద్రం రైతు సేవా కేంద్రం పరిధిలోని దొండ్లవాగు గ్రామంలో శుక్రవారం రైతులకు శనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఓ రమేష్ శనగ విత్తన పంపిణీని పరిశీలించి శనగ విత్తనాల నాణ్యత గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1107 మంది రైతులకు గాను 1560 క్వింటాళ్ల శనగలకు రైతులు నమోదు చేసుకోగా.. 319 క్వింటాళ్ల శనగ విత్తనాలను పంపిణీ చేశామన్నారు. అలాగే విత్తనాలు తీసుకునేటప్పుడు కూడా రైతులు వేలిముద్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది హరిత, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తున్నాం

పులివెందుల టౌన్: దళితులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ఆలూరి రమణలు తెలిపారు. శుక్రవారం సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామంలో ఇటీవల దాడిలో గాయపడిన దళితుడు ఎం.భార్గవ్ ఇంటికి వారు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తాలుకా ఇన్‌చార్జి గంగరాజు, ఎమ్మార్పీఎస్ తాలుకా అధ్యక్షుడు గంగాధర్, గౌరవాధ్యక్షులు బోనాల గోపాల్, తాలుకా ఉపాధ్యక్షుడు లింగాల రవి, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు వెంకట్‌కు ఆహ్వానం

వేంపల్లె: ప్రపంచ తెలుగు సాహితీ కళా జాతరకు వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ టులో పనిచేస్తున్న సివిక్స్ అధ్యాపకులు ఆవుల వెంకట్‌కు ఆహ్వానం అందింది. కృష్ణా జిల్లా తాడేపల్లిగూడెంలో అంతర్జాతీయ ప్రమాణాల గల సాహిత్య సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే కళా జాతరలో ఈనెల 19, 20 తేదీలలో 24 గంటలపాటు ఏకధాటిగా జరిగే ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈయన వెళ్లనున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి

కమలాపురం: ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత మెప్మా సంఘ సభ్యులపై ఉందని కమలాపురం నగర పంచాయతీ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త సంఘాల ఏర్పాటు, సంఘాల బ్యాంకు లింకేజీ, స్వయం ఉపాధి రుణాలు, పీఎం విశ్వకర్మ రుణాలు, ఓఎన్‌డీసీ, అర్బన్ మార్కెట్ యొక్క ప్రాముఖ్యత, హౌసింగ్ తదితర వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు అందేలా చూడాల్సిన బాధ్యత మెప్మా సంఘ సభ్యులపై ఉందన్నారు.